క్లుప్తంగా

చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యత


ప్రతిభచూపిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

చీరాల టౌన్: చదువుతో పాటు క్రీడలకూ కూడా ప్రాధాన్యత ఇస్తున్నామని భాష్యం ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, శిరీషలు తెలిపారు. ఈనెల 8 తేదీన పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేటలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ జాతీయ స్థాయిలో కుంగ్‌ఫూ, కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో పాఠశాల విద్యార్థులు పతకాలు సాధించారు. ఈసందర్భంగా సోమవారం విజేతలకు యాజమాన్యం అభినందన కార్యక్రమాన్ని నిర్వహించింది. పోటీల్లో 5 బంగారు పతకాలు, 2 వెండి పతకాలు, 3 రజత పతకాలు సాధించారని వారు తెలిపారు. కార్యక్రమలో విజేతలను, పీఈటీ వంగర సుబ్బులను ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం కలిగి ఉన్న మహిళ అరెస్టు

చీరాల: అక్రమంగా మద్యం బాటిళ్లు కలిగి ఉన్న మహిళను ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జిల్లా ఎక్సైజ్ ఆఫీసర్ ఆదేశాల మేరకు చీరాల ఎక్సైజ్ సీఐ పి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది సోమవారం చీరాల మండలం పరిధిలోని పలు ప్రాంతాలలో దాడులు నిర్వహించారు. వేటపాలెం రైల్వేగేటు సమీపంలో ఓ మహిళను అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

గ్రామస్తులకు రక్తపరీక్షలు


రక్త పరీక్షల నిర్వాహణను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి విజయమ్మ

పర్చూరు (చినగంజాం): మండలంలోని చిన్న నందిపాడు గ్రామంలో వైద్య సిబ్బంది సోమవారం గ్రామస్తులకు రక్తపరీక్షలు నిర్వహించారు. జిల్లా వైద్యాధికారి విజయమ్మ ముఖ్యఅతిథిగా పాల్గొనగా ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్య సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. క్యాన్సర్‌పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. నీటి పరీక్షల్లో భాగంగా గ్రామంలో నీటి పరీక్షను జరిపి అశ్చర్యం వ్యక్తం చేశారు. నీటిలో మలినాలు ఎక్కువగా ఉండటంతో కాచి వడపోసిన నీటినే తాగాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌ఓ కీర్తన, బీ బాబు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



చీరాల రూరల్: భారత న్యాయవాదుల సంఘం -2025 నూతన కోర్టు క్యాలండర్‌ను స్థానిక కోర్టు భవన సముదాయంలోని బార్ అసోసియేషన్ హాలులో సోమవారం ఐఏఎల్ జాతీయ కార్యదర్శి బూదరాజు శశికిరణ్, ఐఏఎల్ పట్టణ అధ్యక్షుడు కరవది భానుప్రకాష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరవ రమేష్‌బాబు చేతులు మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. భారత న్యాయవాదుల సంఘం 2025 సంవత్సరానికి సంబంధించిన క్యాలెండర్ న్యాయవాదులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాదులు సిహెచ్. సురేష్, కె. శేషగిరిరావు, కె. వాసుబాబు న్యాయవాదులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

బల్లికురవ: పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందటంతో సంతమాగులూరు సీఐ వెంకట్రావు ఆధ్వర్యంలో బల్లికురవ, సంతమాగులూరు పోలీసులు దాడులు చేపట్టారు. మండలంలోని వైదన గ్రామ సమీపంలోని పులికొండ వద్ద పేకాట ఆడుతున్న 8 మంది జూదరులను అదుపులోకి తీసుకుని వీరి నుంచి రూ.1,18,300 నగదు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం కోర్టుకు హాజరు పరచనున్నట్లు చెప్పారు. దాడుల్లో బల్లికురవ ఎస్సై జీవి చౌదరి, సంతమాగులూరు ఎస్సై పట్టాభిరామ్, ఎస్‌బీ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల వితరణ

మార్టూరు: నాలుగు దశాబ్దాల క్రితం తాము విద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాల రుణం కొంతైనా తీర్చుకుందాం అనుకున్నారు ఆ పూర్వ విద్యార్థులు. అనుకున్నదే తడవుగా మార్టూరు మద్ది సత్యనారాయణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆ నలుగురు ప్రస్తుతం పాఠశాలకు అవసరమైన ఆరు బల్లలను కొనుగోలు చేసి పాఠశాల ఉపాధ్యాయ బృందానికి అందజేశారు. హెచ్‌ఎం రూత్ మెర్సీ జాయ్ పూర్వ విద్యార్థులైన ఘంటసాల బంగారుబాబు, కమ్మ సుబ్బారావు, పాతూరి రమేష్ బాబు, పఠాన్ కరిముల్లాలను అభినందించారు.

స్వామీ.. మిమ్మల్ని కాపాడేదెవరు !


శంకరస్వామి ఆలయం


ఆలయం ముందు ఉన్న శాసనాలు


పడిపోయిన చెన్నకేశవ స్వామి ఆలయ గోపురం

- కూలేదశలో కొణిదెన ఆలయాలు
- పడిపోయిన చెన్నకేశవస్వామి ఆలయ గోపురం
- అంచనాల తయారీలో దేవదాయశాఖ జాప్యం
- విద్యుత్ శాఖ మంత్రి దృష్టికి తెచ్చినా చర్యలు శూన్యం

బల్లికురవ: అధికారులు, పాలకుల నిర్లక్ష్యం కారణంగా పురాతన ఆలయాలు కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. ఎంతో చరిత్ర కలిగిన మండలంలోని కొనిదెన గ్రామంలోని పురాతన ఆలయాలు జీర్ణావస్థతో కూలేదశకు చేరాయి. గతేడాది నవంబర్‌లో కురిసిన వర్షాలకు గ్రామానికి ఆగ్నేయ భాగంలో ఎత్తైన కొండపై వేంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయగోపురం వెనుక భాగం పడిపోయింది. సంవత్సరం నుంచి దేవదాయశాఖ అధికారుల దృష్టికి తెస్తున్నా ఎలాంటి చర్యలు లేవని గ్రామస్తులు వాపోతున్నారు. కనీసం ఆలయ ప్లాన్‌లో భాగంగా అనుమతులు ఇవ్వకుండా, పునఃనిర్మాణానికి అంచనాలు తయారు చేయకుండా కాలయాపన చేస్తున్నారని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆలయానకి సుక్షేత్రమైన భూములు ఉన్నాయి. చెన్నకేశవస్వామికి 30 ఎకరాలు, వేణుగోపాల స్వామికి 12 ఎకరాలు, భవాని సమేత శంకర స్వామికి 34 ఎకరాలు ఉన్నాయి. గ్రామంలోని రైతులు ఆర్థికంగా దెబ్బ తినటం, మెట్ట భూములు కావడంతో ఎకరాకు రూ.5000 నుంచి రూ.6000 మాత్రమే కౌలు పలుకుతోంది. ఈ సొమ్ముతో నిత్యం ధూపదీప నైవేద్యాలు, అర్చకుడి జీతాలు, పర్వదిన రోజుల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలకే సరిపోతుంది.

అసంపూర్తి పనులు చేసిన పురావస్తు శాఖ..

గ్రామ కూడలిలో ఒకే ప్రాంగణంలో వేంచేసి ఉన్న భవాని సమేత శంకరస్వామి, వేణుగోపాలస్వామి ఆలయాలు తమ పరిధిలో ఉన్నాయని నెల్లూరుకు చెందిన పురావస్తు శాఖ అధికారులు 2014 జూన్‌లో ప్రకటించారు. దీంతో అభివృద్ధికి చేయూతనివ్వాల్సిందిగా గ్రామస్తులు విన్నవించారు. ఈ రెండు ఆలయాలు పరిశీలించి అభివృద్ధి పనులకు రూ.2 కోట్ల నిధులు విడుదల చేశారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ ఆలయాల చుట్టూ ప్రహరీ, గేటు ఏర్పాటు చేశారు. ఆలయంలోని కల్యాణ మండపం, శంకరస్వామి ఆలయాన్ని కొంతమేర అభివృద్ధి పరిచారు. శాసనాల రక్షణతో ఫ్లోరింగ్, కల్యాణ మండపం అభివృద్ధి, విద్యుత్ సౌకర్యం పనులు అసంపూర్తిగా నిలిచాయి. కాని ఇంతవరకు ఆ కాంట్రాక్టర్ పత్తాలేకుండా పోయారు.

మంత్రిని కలిసి విన్నవించినా ఫలితం శూన్యం..

గ్రామంలోని ఆలయాల దుస్థితిని ఇటీవల గ్రామస్తులు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ నివాసానికి వెళ్లి విన్నవించారు. చెన్నకేశవ స్వామి ఆలయ నిర్మాణానికి రూ.2 కోట్లు ఖర్చు అవుతుందని, మీ వాటాగా రూ.70 లక్షలు సమకూర్చుకొని నా వద్దకు రండి అనటంతో బిత్తరపోయినట్లు గ్రామస్తులు వివరించారు. ఆ నిధులు సమకూర్చే పరిస్థితిలో లేమని నిర్ణయించుకున్న గ్రామస్తులు అభివృద్ధి పనులకు కమిటీ ఏర్పాటు చేసుకున్నారు. ఈ కమిటిలో 13 మంది సభ్యులు ఒక్కొక్కరు రూ.3 లక్షల చొప్పున విరాళాలు సమకూర్చాలని నిర్ణయించుకున్నారు. ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూడకుండా తామే అభివృద్ధి చేసుకుందామని గ్రామస్తులు తీసుకున్న నిర్ణయం అభినందనీయమని పలువురు ప్రశంసిస్తున్నారు.

> **వాటాగా విరాళాల సేకరణ ఇబ్బందిగా ఉంది..**
>
> 
>
> 12వ శతాబ్దంలో కొణిదెన గ్రామాన్ని చోళ రాజులు పరిపాలించినట్లుగా పెద్దలు చెప్తున్నారు. అప్పట్లో నిర్మించిన ఈ ఆలయాలు చరిత్రకు ఆనవాళ్లు. ఇలాంటి ఆలయాలను అభివృద్ధి పరచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ప్రభుత్వ సాయంతో ఆలయాలను అభివృద్ధి పరచాలి.
>
> – చట్టి నాగేశ్వరరావు, కొణిదెన
>
> **భయంతోనే నైవేద్యాలు పెడుతున్నా..**
>
> 
>
> చెన్నకేశవ స్వామి ఆలయగోపురం కొంత భాగం పడిపోయింది. ఏ సమయంలో ఏ భాగం పడుతుందో అంతు చిక్కడం లేదు. బిక్కుబిక్కుమంటూనే ఆలయంలోకి వెళ్లి ధూప దీప నైవేద్యాలు పెడుతున్నా. సంవత్సరం నుంచి భక్తుల సంఖ్య పూర్తిగా తగ్గిపోయింది.
>
> – ఐవీఎస్ఎస్ ఆచార్యులు, అర్చకుడు

తుఫాన్ దృష్ట్యా పంటకోతలు వద్దు


కోలలపూడిలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏవో కిరణ్ కుమార్

మార్టూరు: త్వరలో ఏర్పడబోయే అల్పపీడనం దృష్ట్యా వరి పంట కోయరాదని ఏవో కిరణ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం కోలలపూడి గ్రామంలో మొక్కజొన్న, వరి పంటలను పరిశీలించి ఆయన రైతులతో మాట్లాడారు. 10, 11, 12 తేదీల్లో తుఫాను హెచ్చరికల దృష్ట్యా నాలుగైదు రోజులు వేచి చూడాలని తెలిపారు. వర్ష ప్రభావం వలన మొక్కజొన్న పంట ఎదుగుదల ఆగిపోయే అవకాశం ఉన్నందున ఎకరా పంటపై 19:19: 19 లేదా 13:0 0: 4 5 ఒక కిలో పిచికారీ చేసుకోవాలని తెలిపారు. అవసరాన్ని బట్టి సూక్ష్మ పోషకాలైన మాక్స్ లేదా ఫారం 4ను ఎకరాకు ఒక కిలో చొప్పున పిచికారీ చేసుకోవాలని తెలిపారు. ఆకు మచ్చ తెగులు నివారణకు ప్రోపికొనజోల్ 200 మిల్లీలీటర్లు ఎకరాకు, మాను మచ్చ తెగులు నివారణకు రిడోనిల్ గోల్డ్ 400 గ్రాములు ఎకరాకు పిచికారీచేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ గోపి స్థానిక రైతులు పాల్గొన్నారు.

పర్చూరు (చినగంజాం): రాబోయే తుఫాన్ హెచ్చరికల దృష్ట్యా రైతులు వరి పంట, ఇతర పంటల కోతలు కోయవద్దని పర్చూరు ఏవో ఎస్ రామ్మోహనరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు మూడు రోజులు పంట కోతకు వచ్చిన వరి పంటతో పాటు ఇతర పంటల విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

అద్దంకి రూరల్: వాయు గుండం కారణంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మొక్కజొన్న, వరి పంటల కోతలను రైతులు వాయిదా వేసుకోవాలని ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ ఒక ప్రకటనలో కోరారు.

క్రైం రేట్ తగ్గించేలా తగిన చర్యలు


గౌరవ వందనం స్వీకరిస్తున్న డీఎస్పీ మొయిన్

కారంచేడు: చీరాల సబ్ డివిజన్ పరిధిలోని నేరాల శాతాన్ని తగ్గించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చీరాల డీఎస్పీ మహ్మద్ మొయిన్ అన్నారు. సోమవారం ఆయన కారంచేడు పోలీస్‌స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన పరిశీలించారు. మొదట ఆయన ఎస్ఐ వీ వెంకట్రావు ఆధ్వర్యంలో సిబ్బంది గౌరవ వందనం చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులు, వాటి ప్రగతిపై ఇంకొల్లు సీఐ, కారంచేడు ఎస్ఐలతో చర్చించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి


సమావేశంలో మాట్లాడుతున్న నీలం నాగేంద్ర

అద్దంకి రూరల్: ఎన్నికలప్పుడు ఎస్సీ, ఎస్టీలకు సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రం అన్నారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నాగేంద్రం మాట్లాడుతూ ప్రధాని మోదీ, చంద్రబాబు ఎస్సీ, ఎస్టీలను చీల్చే వర్గీకరణకుసై అంటూ, వారి అభివృద్ధికి అవసరమైన నిధుల మంజూరుకు నైనై అంటున్నారన్నారు. ఎస్సీల ఐక్యతను విచ్ఛిన్నం చేయటమే లక్ష్యంగా వర్గీకరణ ఉద్యమాన్ని చంద్రబాబు ప్రోత్సాహమిస్తున్నాడన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు కిరణ్, బత్తుల మోహనరావు, కాకుమాను రవి, నారాయణ, యోగయ్య తదితరులు పాల్గొన్నారు.

59 మంది ఉద్యోగాలకు ఎంపిక


ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో ప్రిన్సిపాల్

అద్దంకి రూరల్: స్థానిక కేఆర్కే డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో సోమవారం ప్రిన్సిపాల్ వేల్పుల మోహన్‌రావు ఆధ్యక్షతన జాబ్ డ్రైవ్ నిర్వహించారు. జాబ్ డ్రైవ్‌కి 116 మంది అభ్యర్థులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోగా 104 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వీరిలో 59 మందికి వివిధ సంస్థలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైనా అభ్యర్థులకు కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు, ఐక్యూసీ కోఆర్డినేటర్ ఎంవీ. సత్యనారాయణ, జేకేసీ కోఆర్డినేటర్ ఎస్. షర్మిలారాణి, ఏ శిఖామణి, వినుకొండ రమేష్, ఎంపికైన అభ్యర్థులకు ఆఫర్ లెటర్‌లు అందజేశారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం తగదు

పర్చూరు (చినగంజాం): రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను అధికారులు సత్వరం పరిష్కరించాలని బాపట్ల ఆర్డీవో గ్లోరియా సూచించారు. సోమవారం మండలంలోని చిననందిపాడులో నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సదస్సులోని గ్రామ సభలో ఆర్డీవో గ్రామస్తుల నుంచి సర్వే, ఎండోమెంట్, ప్రభుత్వ భూముల ఆక్రమణలు, పాస్ పుస్తకాల సవరణకు సంబంధించి పలు అర్జీలను స్వీకరించారు. అర్జీలలోని సమస్యలను సత్వరం పరిష్కరించాలని ఆమె అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులతో పాటు పర్చూరు డీటీ అరుణ, ఆర్ఐ బీ ప్రేమ్‌కుమార్, మండల సర్వేయర్ బాలాంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు మోసం


డీటీకి వినతి పత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

బల్లికురవ: ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపును తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఐ బాపట్ల జిల్లా కార్యదర్శి తన్నీరు శింగరకొండ కోరారు. సోమవారం డిప్యూటి తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు హమీ ఇచ్చిన సూపర్ సిక్స్‌లో నిరుద్యోగ యువతీ,యువకులకు భృతి, మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణానికి, రైతులకు ఇచ్చే సాయాన్ని, విద్యాదీవెన, తల్లివందనం తక్షణమే అందించాలన్నారు. రోజురోజుకూ చుక్కల నంటుతున్న నిత్యావసర ధరలకు కళ్లెం వేయాలని, స్మార్ట్ మీటర్లు బిగించే విధానాన్ని స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం అందించిన వారిలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు వల్లెపు నరసింహం, మండల నాయకుడు అట్లూరి శ్రీను, నాగబోయిన శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా రేషన్ డీలర్ల రాత పరీక్ష


రాత పరీక్ష రాస్తున్న అభ్యర్థులను పరిశీలిస్తున్న తహశీల్దార్ గోపీకృష్ణ

చీరాల టౌన్: రేషన్ షాపుల డీలర్ల నియామకానికి విడుదల చేసిన నోటిఫికేషన్‌లో ఎంపికకు సోమవారం నిర్వహించిన రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. సోమవారం చీరాల పట్టణంలోని ఎన్ఆర్ అండ్ పీఎం హైస్కూల్‌ను పరీక్ష కేంద్రంగా అధికారులు ఎంపిక చేశారు. చీరాల రెవెన్యూ డివిజన్ పరిధిలోని 10 మండలాల్లో 143 రేషన్ షాపులకు డీలర్ల నియామకానికి పరీక్ష నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు జరిగిన పరీక్ష చీరాల తహశీల్దార్ కుర్రా గోపీకృష్ణ పర్యవేక్షించారు. 112 మంది అభ్యర్థుల్లో 18 మంది గైర్హాజరుకాగా 94 మంది పరీక్షకు హాజరయ్యారు. గత నెల 20 తేదీన చీరాల ఆర్డీవో విడుదల చేసిన నోటిఫికేషన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి ఎంపిక పరీక్ష నిర్వహించామని, పరీక్ష పత్రాల మూల్యాంకనం అనంతరం ఫలితాలు విడుదల చేస్తామని తహశీల్దార్ తెలిపారు.

ప్రతి విద్యార్థి గణితంపై పట్టు సాధించాలి


పందిళ్లపల్లిలో ప్రతిభా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


కారంచేడులో గణిత ప్రశ్నపత్రం విడుదల చేస్తున్న ఎంఈఓలు

కారంచేడు: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థి తమ భాషలతో పాటు గణితంపైన మంచి పట్టు గలిగి ఉండాలని ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లులు అన్నారు. సోమవారం వారు మండల కేంద్రం కారంచేడు ప్రాథమికోన్నత పాఠశాలలో గణిత మేధావి రామానుజన్ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవోలు గణితంపై నిర్వహించే ప్రతిభా పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో యర్రంవారిపాలెం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జే శేఖర్‌బాబు, ఎం ప్రభూజీ, ఏ శ్రీనివాసరావు, పీ శివకోటేశ్వరమ్మ, రామకృష్ణ, గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేటపాలెం: విద్యార్థులు ప్రతిభాపాటవాలను వెలికి తీయడానికే పోటీలు నిర్వహిస్తారని హెచ్‌ఎం బలిమి శేఖర్‌రావు పేర్కొన్నారు. పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో రామానుజన్ జయంతిని పురస్కరించుకొని గణితంలో విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుంటూరు శివశంకర్, కటకం నారాయణ, డి హైరామారావు, పద్మావతి, జయరావు, టీ వెంకటేశ్వర్లు, బీ మోహన్‌రావు, నాగరాజు, రత్నం, పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ క్షతగాత్రుడు మృతి

మార్టూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూఓ వ్యక్తి మృతి చెందాడు. ఏఎస్సై మహబూబ్‌బాషా వివరాల మేరకు.. పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కందుకూరులోని బూడిదపాలేనికి చెందిన షేక్ సుభాని (40) గత కొంతకాలంగా మార్టూరులోని గన్నవరం రోడ్డులో కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. ఇతనికి భార్య మస్తానీ, అయిదు, మూడు సంవత్సరాల వయసుగల ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈనెల 7వ తేదీ మధ్యాహ్నం సుభాని తన స్నేహితుడు షేక్ జాన్ సైదాతో కలిసి సర్వీస్ రోడ్డులో ద్విచక్ర వాహనంపై జొన్నతాళి క్రాస్ రోడ్డు వద్ద గల భారత్ గ్యాస్ ఆఫీసుకు బయలుదేరి వెళ్తున్నాడు. ఈ క్రమంలో స్థానిక అమరావతి నూలు మిల్లు సమీపంలో అదే మార్గంలో ఎదురుగా వస్తున్న మరో బైక్ వీరిని ఢీకొట్టి వెళ్లిపోయాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సుభానీని స్నేహితుడు జాన్ సైదా, భార్య కలిసి మార్టూరు, చిలకలూరిపేట ఆసుపత్రుల్లో చూపించగా పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచనపై గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి అదే రోజు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సుభాని పరిస్థితి విషమంగా మారడంతో ఆదివారం రాత్రి మృతి చెందాడు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం సుభాని మృతదేహాన్ని బంధువులకు అప్పగించగా సోమవారం సాయంత్రం కందుకూరులో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

రోటరీ ఆధ్వర్యంలో దంత పరీక్షలు


దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

పర్చూరు (చినగంజాం): పర్చూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించినట్లు క్లబ్ అధ్యక్షులు తోకల కృష్ణమోహన్ తెలిపారు. సోమవారం మండలంలోని ఉప్పుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో145 మంది విద్యార్థులకు ఉచితంగా దంత పరీక్షలు నిర్వహించారు. గుంటూరుకు చెందిన పూజిత దంత వైద్యశాల డాక్టర్ ముప్వా సురేష్ బాబు 70 మంది విద్యార్థులకు దంత సమస్యలున్నట్లు గుర్తించి చికిత్స తీసుకోవాలని సూచించారు. అనంతరం క్లబ్ సభ్యులు విద్యార్థులకు రూ. 7 వేలు విలువ చేసే బ్రష్‌లు, టూత్ పేస్ట్‌లు, బిస్కట్ ప్యాకెట్లను అందించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కోమటి ఆంజనేయులు, సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెక్కల కష్టం.. నీటిపాలు

- ఫెంగోల్ తుఫాన్ ధాటికి నీట మునిగిన వరి
- కోలలపూడిలో 80 ఎకరాల పంట నీటిపాలు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు


ఒరిగిపోయిన వరిని చూపుతున్న రైతులు (ఫైల్)

మార్టూరు: ఫెంగోలు తుఫాన్ ధాటికి రైతులు విలవిల్లాడిపోయారు. చేతికి అందివచ్చిన పంట నాశనం అవుతుండటంతో కన్నీళ్లే దిక్కయ్యాయి. ఇటీవల కురిసిన తుఫాను కారణంగా మండలంలోని కోలలపూడి గ్రామంలో 80 ఎకరాలకు పైగా వరి పంట రైతుల చేతికి దక్కకుండా నీటి పాలైంది. రబీ సీజన్‌లో మండలంలో మొదటగా వరి నాట్లు వేసేది.. పంటను కోసేది కూడా కోలలపూడి రైతులే. సుమారు వంద రోజుల క్రితం నాటిన వరి డిసెంబర్ నెల ఆఖరిలోపు కోతకి వస్తుందనగా అకాల వర్షానికి నీట మునగడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సుమారు 30 మందికి రైతులకు చెందిన 80 ఎకరాల వరి పంట చేతికి దక్కకుండా పోవడంతో రైతులు ప్రభుత్వ సహాయం కోసం ఎదురు చూస్తున్నారు. కౌలుతో కలిపి ఎకరాకు రూ.60 వేల నుంచి రూ.1 లక్ష వరకు పెట్టుబడి పెట్టారు. ఈక్రమంలో విత్తనం పొట్టకు చేరే దశలో తుఫాన్ రావడంతో పంట తిప్పుకునే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. తడిసిన ధాన్యం ఏమైనా చేతికి అందితే ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై మండల వ్యవసాయ అధికారి కిరణ్ కుమార్‌ను వివరణ కోరగా కోలలపూడి గ్రామంలో 80 ఎకరాల వరి పంట నీట మునిగినట్లు క్షేత్రస్థాయిలో గుర్తించి జిల్లా అధికారులకు నివేదిక పంపినట్లు తెలిపారు. రైతులు తక్షణ ఉపశమనంగా తడిసిన ధాన్యం మొలక రాకుండా ఉండటం కోసం ఐదు శాతం ఉప్పు నీటి ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలని తెలిపారు. రబీ సీజన్‌లో బీమా చేయించిన పంటలకు నష్టపరిహారం రైతులకు అందేలా చూస్తామని ఏవో తెలిపారు.

నష్టపరిహారం అందించాలి..

బీపీటీ రకం వరి విత్తనాలను సుమారు 100 రోజుల క్రితం 1.75 ఎకరాలలో సాగు చేశాను. ఇప్పటివరకు కౌలు సహా పెట్టుబడి ఎకరాకు రూ.60 వేలు కాగా మొత్తం రూ.1 లక్ష ఖర్చు చేశాను. పంటల బీమా పథకం ద్వారా పంటలు నమోదు చేసుకున్నాను. ప్రభుత్వం రైతుల పరిస్థితి గమనించి నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలి.

తాతా ఏడుకొండలు, రైతు, కోలలపూడి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

చీరాల డివిజన్

90101 55593 (చీరాల)

Office mail : sakshiongads@gmail.com